


నర్సంపేట రూరల్: గురిజాలలో వర్షానికి దెబ్బతిన్న వరి పంట, ఖానాపురంలో వర్షానికి తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు

# నీటిలోనే వరి పంట

- లబోదిబోమంటున్న అన్నదాతలు
- దిగులు పడుతున్న పత్తి రైతులు
- మొలకెత్తుతున్న ధాన్యం



శాయంపేట: నల్లబారిన పత్తి చేలు

శాయంపేట/ఖానాపురం/నర్సంపేటరూరల్, డిసెంబర్ 7: అకాల వర్షాలు అన్నదాతలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. చేతికొచ్చిన పంట నీట మునిగింది. తుఫాన్ ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు వరి రైతులు కోలుకోలేని దెబ్బతీశాయి. శాయంపేట మండలంలోని ఆరెపల్లి, శాయంపేట, పత్తిపాక, ప్రగతిసింగారం, నేరేడుపల్లి, మైలారం, జోగంపల్లి, కొప్పుల, పెద్దకోడెపాక, సూరంపేటలో వరి పంట వందల ఎకరాల్లో నేలవాలింది. పత్తి పంట కూడా దెబ్బతిన్నది. మరికొద్ది రోజులు పరిస్థితి ఇలాగే ఉంటే నేలవాలిన వరి నీటిలో మొలకెత్తే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే, అధికారులెవరూ పంట పరిశీలన చేయడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖానాపురం మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు ఆరబోసుకున్న ధాన్యం పలు చోట్ల తడిసింది. పాకాల ఆయకట్టులో కోతలు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో వర్షాలు కురవడతంతో నిలిచిపోయాయి. ధాన్యం మొలకెత్తే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నర్సంపేట మండలంలోని చిన్నగురిజాల, గురిజాల, జీజీఆర్‌పల్లి, మహేశ్వరం, రాములునాయక్‌తండా, గుంటూరుపల్లిలో అకాల వర్షానికి పత్తి, వరి, మొక్కజొన్న, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి.



నర్సంపేట రూరల్: చిన్న గురిజాల శివారులో వర్షానికి తడిసిన వరి మెదలు



నర్సంపేట రూరల్ : జీజీఆర్‌పల్లిలో వర్షానికి దెబ్బతిన్న పత్తి పంట



కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో రత్నమాల

## యూ డైస్ ఫార్మాట్‌ను సకాలంలో అందించాలి

చెన్నారావుపేట, డిసెంబర్ 7: పాఠశాలకు సంబంధించిన యూ డైస్ ఫార్మాట్‌ను ఉపాధ్యాయులు సకాలంలో అందించాలని ఎంఈవో రత్నమాల అన్నారు. మండలకేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు యూడైస్ ఫార్మాట్‌పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ యూ డైస్ ఫార్మాట్‌లో విద్యార్థులు, పాఠశాలల మౌలిక సదుపాయాలు, టీచింగ్, నాన్ టీచింగ్ వివరాలను సరిగా నింపి ఆన్‌లైన్ చేసి ఈ నెల 11న కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు సకాలంలో అందించాలన్నారు. అలాగే, ప్రతి పాఠశాలలో ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు, ఎండీఎం వివరాలను సకాలంలో ఆన్‌లైన్ చేయాలన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెంచాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ బైరి సరళ, హెచ్‌ఎంలు ప్రభాకర్‌రావు, సలీమ్, రవీందర్, జయ, భద్రయ్య, రవి, నాగేంద్రాచారి, రియుజుద్దీన్, పవనకుమారి, ఈర్య, ఇంద్రయ్య, కొమురయ్య, ఎమ్మార్సీ సిబ్బంది స్వప్న, అశోక్, సీఆర్పీలు సంపత్, స్వామి, బాలు, హేమలత పాల్గొన్నారు.



ఏనుగల్‌తండాలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

## ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలి

నర్సంపేటరూరల్, డిసెంబర్ 7: ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలని ఏనుగల్‌తండా సర్పంచ్ బానోత్ స్వాతి అన్నారు. ఏనుగల్‌తండా జీపీ కార్యాలయ ఆవరణలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కొన్ని రోజులుగా గ్రామంలో విషజ్వరాలు ప్రభలుతున్నందున గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో హెల్త్‌క్యాంపు ఏర్పాటు చేశామన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శిబిరంలో మెడికల్ ఆఫీసర్ అలేఖ్య, ఏఎన్‌ఎం శ్రీలత, ఆశ వర్కర్ సరోజ, బానోత్ రవికుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ వెంకట్‌రెడ్డి రాజీనామా

ఖానాపురం, డిసెంబర్ 7: రైతుబంధు సమితి మండల కన్వీనర్ కుంచారపు వెంకట్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా పత్రాన్ని గురువారం జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్‌కు అందజేశారు. అనంతరం వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి చెందినందున నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు.



సెల్‌ఫోన్లను అప్పగిస్తున్న ఎస్సై దేవేందర్

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

శాయంపేట, డిసెంబర్ 7: వివిధ ప్రాంతాల్లో ముగ్గురు వ్యక్తులు పోగొట్టుకున్న మూడు సెల్‌ఫోన్లను పట్టుకుని గురువారం బాధితులకు అప్పగించినట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు. శాయంపేటకు చెందిన ఎలక్ట్రీషియన్ అకినపెల్లి అరుణ్‌కుమార్, తహారాపూర్‌కు చెందిన రైతు కొమ్ముల సమ్మయ్య, పోచారం గ్రామానికి చెందిన విద్యార్థి కొలెపాక రాకేశ్ వివిధ ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు పోగొట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఐటీ కోర్ సిబ్బంది సాయంతో మొబైళ్లను పట్టుకొని బాధితులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.



ఎన్నికైన అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి

## హోరాహోరీగా రైస్ మిల్లర్ల ఎన్నికలు

నర్సంపేట, డిసెంబర్ 7: నర్సంపేట డివిజన్‌స్థాయి రైస్ మిల్లర్ల సంఘం ఎన్నికలు గురువారం హోరాహోరీగా జరిగాయి. అధ్యక్షుడిగా గంధం నరేందర్, కార్యదర్శిగా శింగిరికొండ మాధవశంకర్, కోశాధికారిగా కానుగంటి రవి ఎన్నికయ్యారు. అధ్యక్ష పదవికి గంధం నరేందర్‌తోపాటు ఇరుకు కోటేశ్వర్‌రావు పోటీపడ్డారు. నరేందర్‌కు 48, కోటేశ్వర్‌రావుకు 18 ఓట్లు వచ్చాయి. శింగిరికొండ మాధవశంకర్‌కు 40, శివకు 26 ఓట్లు వచ్చాయి. కానుగంటి రవికి 36, భూపాల్‌రావుకు 30 ఓట్లు వచ్చాయి. కొత్త కార్యవర్గం ఎన్నికైన తర్వాత సమావేశం నిర్వహించారు.

## అక్కంపేట రెవెన్యూ గ్రామం కోసం ప్రతిపాదనలు

**గ్రామ సభలో హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్**



అక్కంపేట గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

ఆత్మకూరు, డిసెంబర్ 7: స్వర్గీయ ప్రొఫెసర్ జయశంకర్ సార్ స్వగ్రామమైన మండలంలోని అక్కంపేటను రెవెన్యూ గ్రామంగా చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ తెలిపారు. గురువారం అక్కంపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఎనకతళ్ల విజయ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గ్రామస్తుల కోరిక మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నామని చెప్పారు. అక్కంపేట గ్రామస్తులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కల త్వరలోనే నెరవేరనుందని తెలిపారు. అదనపు కలెక్టర్ మహేందర్‌జీ మాట్లాడుతూ అక్కంపేట గ్రామస్తులు చాలాకాలంగా తమ గ్రామాన్ని రెవెన్యూగా మార్చాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. రెవెన్యూ విలేజీ ఏర్పాటు చేయాలని ప్రవేశపెట్టిన తీర్మానానికి గ్రామస్తులు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో పరకాల ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో చేతన్ కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ పోగుల ఇందిర, కార్యదర్శి సంపూర్ణ, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ నాయకుల సంబురాలు

అక్కంపేటను రెవెన్యూ విలేజ్‌గా మార్చాలని ప్రభుత్వానికి కలెక్టర్ ప్రతిపాదనలు పంపడంతో కాంగ్రెస్ నాయకులు సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఎన్నో ఏళ్ల కల నెరవేరనుండడంతో స్వీట్లు పంపిణీ చేశారు.

## 'బడీడు పిల్లలు బడిలోనే ఉండాలి'



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బీసీఐ ప్రతినిధులు, టీచర్లు

శాయంపేట, డిసెంబర్ 7: బడీడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని బీసీఐ ప్రాజెక్టు సమన్వయకర్త తరాల తిరుపతి అన్నారు. నేరెడుపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల కార్మిక నిర్మూలన చట్టాలపై డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఆర్థిక సాయంతో ప్రజ్వల ఎఫ్‌పీసీఎల్ బీసీఐ ప్రాజెక్టు ద్వారా బాల కార్మికులు, పురుగు మందులపై గురువారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ బాల కార్మిక నిరోధక చట్టం, ఐఎల్‌వో 138 ప్రకారం వ్యవసాయ పనులను 14 ఏళ్లలోపు పిల్లలతో చేయించొద్దని సూచించారు. విద్యార్థులు బాలకార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పరిస్థితులు ఎలా ఉన్నా బడీడు పిల్లలు పనుల్లోకి వెళ్లకుండా బడికే వెళ్లి చదువుకోవాలన్నారు. 15 నుంచి 18 ఏళ్లలోపు విద్యార్థులు పురుగు మందు పిచికారీ సమయంలో ఆ ప్రాంతానికి వెళ్లొద్దన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం సుచరిత, ఉపాధ్యాయులు, బీసీఐ ఫీల్డ్ ఫెసిలిటేటర్ షేక్ గౌస్, పోతు సునీల్ పాల్గొన్నారు.



ఖానాపురంలో స్నేహితుడి కుమార్తె వివాహానికి హాజరైన మిత్రులు

## స్నేహితుల కుమార్తెల వివాహానికి చేయూత

ఖానాపురం, డిసెంబర్ 7: మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 1996-97లో టెన్త్ పూర్తి చేసి బాల్యమిత్రులు తోటి స్నేహితుల కుమార్తెల వివాహానికి ఆర్థిక చేయూతనిచ్చారు. మండలకేంద్రానికి చెందిన కందికొండ సంపత్, కొత్తూరుకు చెందిన మద్దూరి రాజన్న కుమార్తెల వివాహం గురువారం జరిగింది. సంపత్ కూతురు వివాహానికి రూ. 50,032, రాజన్న కూతురు వివాహానికి 25,016 అందించారు. కార్యక్రమంలో వీరమనేని సాగర్‌రావు, సత్యనారాయణ, అక్బర్, అజహర్, హైమద్‌పాషా, ఇస్మాయిల్, మైనోద్దీన్, రమేశ్, సదానందం, రాజు, సుధాకర్, వసురాం, రవీందర్, అశోక్, రవి పాల్గొన్నారు.